# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-07-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. మాస్కో శిఖరాగ్ర సమావేశంలో 2030 నాటికి భారత్, రష్యాల మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్యం లక్ష్యంగా ఇరు దేశాలు నిర్దేశించుకున్నాయి.
2. ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
3. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఈరోజు పర్యటిస్తారు.
4. తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.
5. తెలంగాణలో రైతుల రుణమాఫీకి సంబంధించిన విధివిధానాలను రెండు రోజుల్లో విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.
6. దీర్ఘకాలిక వ్యాధుల అవగాహన దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.

===========================

నూతన సాంకేతిక పరిణామాలు సమాజ అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. ఒడిసాలో పర్యటిస్తున్న రాష్ట్రపతి భువనేశ్వర్‌లోని జాతీయ విజ్ఞాన పరిశోధన సంస్థ-ఎన్ఐఎస్ఈఆర్ 13వ స్నాతకోత్సవ వేడుకల్లో నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలు మానవాళికి ఉపయోగపడటంతోపాటు ఇదే సమయంలో కొత్త సవాళ్లను కూడా విసురుతున్నాయని హెచ్చరించారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే కాకుండా, సమాజసేవ చేయాలని విద్యార్థులకు రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

---------------------------

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య మాస్కోలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాలు 9 కీలక రంగాల్లో సహకారానికి ఒప్పందం కుదుర్చుకున్నాయని విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా తెలిపారు. నిన్న ప్రధానమంత్రి రష్యా పర్యటన వివరాలను మాస్కోలో పాత్రికేయులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా వినయ్ మోహన్ క్వాత్రా మాట్లాడుతూ, మాస్కోలో

జరిగిన 22వ భారత–రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో 2030 నాటికి భారత్, రష్యాల దేశాల మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని లక్ష్యంగా ఇరు దేశాలు నిర్దేశించుకున్నాయని అన్నారు. ఇరువురు నేతల మధ్య జరిగిన సమావేశంలో ప్రధానంగా ఆర్థిక సహకారంపై చర్చ జరిగినట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య సహకారానికి సంబంధించిన అంశాలతో పాటు, వాణిజ్యం, మూలధన అనుసంధానాలు, ఇంధనం, సాంకేతిక సహకారం, రక్షణ భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు వినయ్ మోహన్ క్వాత్రా తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ రంగంపై ముఖ్యమంత్రి నిన్న శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామన్నారు. వ్యవసాయ విద్యుత్ మీటర్లు ఇప్పటికే ఏర్పాటైనచోట అవి వృథా కాకుండా, ప్రభుత్వ ఖర్చుతో సోలార్ ప్యానళ్లు అందజేసి, రైతులే విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా చూస్తామని చెప్పారు. మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి ఇస్తే రైతులకు నగదు చెల్లించేలా చర్యలు చేపడతామన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ విద్యుదుత్పత్తికి కేంద్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల అమలు, అభివృద్ధికి బ్యాంకర్ల సహాయం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నిన్న వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ–ఎస్ఎల్‌బీసీ సమావేశం జరిగింది. రాయితీ రుణాలు, వివిధ పథకాల లబ్ధిదారులకు బ్యాంకర్లు సహకరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. స్వయం సహాయక సంఘాల బలోపేతంలో బ్యాంకర్లదే కీలక పాత్ర అని తెలిపారు. ఈ సమావేశంలో 2024–25 సంవత్సరానికి గానూ 5.4లక్షల కోట్ల రూపాయలతో రుణ ప్రణాళికను ఎస్ఎల్‌బీసీ విడుదల చేసింది.

---------------------------

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఈ రోజు పర్యటిస్తారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ఆర్ఐఎన్ఎల్ గెస్ట్ హౌస్‌కు వెళతారని అధికారులు వెల్లడించారు. రేపు ఉదయం కేంద్ర మంత్రి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సందర్శిస్తారని, అనంతరం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఉక్కు కర్మాగారం భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తారని అధికారులు తెలియజేశారు.

---------------------------

తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టును వచ్చే ఏడాది డిసెంబర్ నాటి కల్లా పూర్తి చేసి నీరందిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలలో 396 కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం మహబూబ్ నగర్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 3.40 లక్షల ఎకరాలకు నీరందించే ఈ జలాశయాన్ని పూర్తి చేసి బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు గ్రీన్ చానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కొత్తగా రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టనున్నామని, త్వరలో కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం విమానాశ్రయం పనులు 2026 నాటి కల్లా పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయనగరంలోని భోగాపురం విమానాశ్రయం ప్రాంతాన్ని కేంద్ర మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు విమానాశ్రయ అనుసంధానం చాలా అవసరమన్నారు. భోగాపురం విమానాశ్రయంలో అంతర్జాతీయ టెర్మినల్, రన్‌వే, నిర్మిస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ,

(..వాయిస్.. 29 సెకన్లు)

---------------------------

తెలంగాణలో రైతుల రుణమాఫీకి సంబంధించిన విధివిధానాలను రెండు రోజుల్లో విడుదల చేస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆగస్టు 15వ తేదీ లోపు తెలంగాణలో 2 లక్షల రూపాయల రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. రైతు భరోసా పై ఖమ్మంలో ఈరోజు నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నామని చెప్పారు. రుణమాఫీపై రైతులు, ఉద్యోగులు, మేధావులు, రైతు సంఘాల నేతల అభిప్రాయాలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

దీర్ఘకాలిక అనారోగ్యాల కారణంగా ప్రతియేటా ప్రతి పది మందిలో ఏడుగురు మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, ఉబ్బసం, గుండె జబ్బులతో సహా అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 10వ తేదీన దీర్ఘకాలిక వ్యాధుల అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల వల్ల సంభవించే మరణాల శాతం తగ్గించడానికి, నయం కాని వ్యాధులకు చికిత్స చేయడానికి, మరిన్ని వనరులను సమయాన్ని కేటాయించాల్సిన అవసరాన్ని తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు మెరుగైన ఆరోగ్య విధానాల కోసం, ఆరోగ్యకరమైన సమాజాలను నిర్మించేందుకు ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా దీర్ఘకాలిక వ్యాధుల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆధ్యాత్మిక , పర్యావరణహిత పర్యాటక ప్రాంతంగా రాజమహేంద్రవరం నగరాన్ని తీర్చిదిద్దడానికి దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాలను రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరితో కలిసి మంత్రి నిన్న పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2027 గోదావరి పుష్కరాలు జరగనున్న క్రమంలో రాజమహేంద్రవరం నగరాన్ని దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికతో తీర్చిదిద్దడం జరుగుతోందని తెలియజేస్తూ..

..వాయిస్... (33 సెకన్లు)

=====================